www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 267 | బుధవారం | 26 – 02 – 2025 | ఎడిటర్ : జయరాం | పేజిలు: 8 | వెల : 4






www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 267 | బుధవారం | 26- 02 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## జనసేనలోకి వైసీపీ కార్పొరేటర్లు




2

# 5 లక్షల కొత్త ఉద్యోగాలు

## ఫార్మా, ఐటీ, డిజిటల్‌హెల్త్‌ల్లో పవర్‌హౌసగా హైదరాబాద్

తొలిఅడుగు, హైదరాబాద్ : "ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్య ఫార్మా క్లస్టర్స్ అభివృద్ధి చేస్తున్నాం. వాటి ద్వారా 5 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యం" అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోనే తొలిసారిగా.. త్వరలో తెలంగాణలో 'లైఫ్ సైన్సెస్ పాలసీ'ని తీసుకురానున్నట్టు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు మరింత సులభతరమైన విధానం రూపకల్పన, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తామని మంగళవారం ఇక్కడ ప్రారంభమైన 'బయో ఏషియా 2025' సదస్సులో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ సదస్సు మంగళవారం నగరంలోని హెచ్ఐసీసీలో ప్రారంభమైంది. సీఎం రేవంత్ ఈ సదస్సును ప్రారంభించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు ఫార్మా, లైఫ్ సైన్సెస్



రంగాలకుచెందిన ప్రముఖ అంతర్జాతీయ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. బయో ఏషియా సదస్సు హైదరాబాద్‌ను ప్రపంచ లైఫ్‌సైన్సెస్ రాజధానిగా మార్చిందని పేర్కొన్నారు. ఫార్మా, ఐటీ, డిజిటల్ హెల్త్ రంగాల్లో గడిచిన 25 ఏళ్లుగా హైదరాబాద్‌ను ఒక పవర్ హౌజ్‌గా నిలబెట్టిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఫార్మా, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, బయోటెక్ కంపెనీలెన్నో

2

## ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి



తొలిఅడుగు, న్యూఢిల్లీ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళుతున్నారు. ఫిబ్రవరి 26న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సీఎ ం రేవంత్ సమావేశం కానున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులతో పాటు బీసీ

2

### కూటమి ప్రభుత్వంపై

## షర్మిల విసుర్లు



తొలిఅడుగు, విజయవాడ : శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం పూర్తిగా సత్యదూరమని

2

## ప్రభుత్వానికి 2 వేల కోట్లకుపైగా నష్టం



తొలిఅడుగు, న్యూఢిల్లీ : ఢిల్లీలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ప్రభుత్వం ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన తప్పుల వల్ల ప్రభుత్వానికి ఎంత నష్టం జరిగిందో అసెంబ్లీలో ప్రస్తావించింది. ఈ క్రమంలో ఆప్ ప్రభుత్వంపై వచ్చిన మొత్తం 14 కాగ్ నివేదికల్లో ఒకటైన లిక్కర్ స్కాంలో భారీగా ఉల్లంఘనలు జరిగాయన్న కాగ్ నివేదికను సమర్పించారు. కాగ్ నివేదిక ప్రకారం 2021-2022 లిక్కర్ పాలసీ కారణంగా ఢిల్లీ ప్రభుత్వం రూ.2,000 కోట్లకుపైగా నష్టపోయినట్లు వెల్లడించారు సీఎం రేఖ గుప్తా. ఈ కాగ్ నివేదిక కేజ్రీవాల్ ప్రభుత్వ హయాంలో జరిగిందన్నారు. ఈ ఎక్సైజ్ పాలసీని అమలు చేయడంలో జరిగిన స్కాంకు సంబంధించి ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉప

2

## శివరాత్రికి ముందే మహా కుంభమేళాకు పోటెత్తిన భక్తజనం



తొలిఅడుగు, న్యూఢిల్లీ : ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా చివరిదశకు వచ్చేసింది. ఈరోజు (ఫిబ్రవరి 25) కూడా 44వ రోజున భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈ క్రమంలో మంగళవారం కూడా సంగమం వైపు వెళ్లే రహదారులు జనసమూహంతో కనిపిస్తున్నాయి. ఈరోజు సాయంత్రం 6 గంటల నుంచి మొత్తం కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికిల్ జోన్‌గా ప్రకటించారు. అయితే ఇప్పటివరకు అంటే ఫిబ్రవరి 25న మధ్యాహ్నం 12 గంటల నాటికి 63.36 కోట్ల మందికిపైగా భక్తులు సంగమంలో స్నానాలు చేశారని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వేదికగా ప్రకటించారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. రేపటి నాటికి దాదాపు 65 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేయగా, ప్రస్తుతం

2



# ప్రభుత్వానికి 2 వేల కోట్లకుపైగా నష్టం

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా నెలల తరబడి తీహార్ జైలులో ఉన్నారని గుర్తు చేశారు సీఎం. ఈ నివేదిక ప్రకారం ప్రభుత్వ ఖజానాకు రూ. 941.53 కోట్ల ఆదాయ నష్టం రాగా, లైసెన్స్ ఫీజుల రూపంలో దాదాపు రూ. 890.15 కోట్ల నష్టం వాటిల్లినట్లు చెప్పారు రేఖ గుప్తా. దీంతోపాటు కొన్ని ఇతర మినహాయింపుల కారణంగా రూ. 144 కోట్ల నష్టం వచ్చిందన్నారు. జోనల్ లైసెన్స్‌ల నుంచి సెక్యూరిటీ డిపాజిట్లు సరిగ్గా తీసుకోకపోవడం వల్ల ప్రభుత్వానికి రూ. 27 కోట్ల నష్టం వచ్చినట్లు చెప్పారు. వీటన్నింటినీ కలిపితే మొత్తం నష్టం రూ. 2002 కోట్లు అవుతుందని కాగ్ తన నివేదికలో పేర్కొన్నట్లు వెల్లడించారు. అలాగే మద్యం విధానంలో మార్పులను సూచించడానికి ఏర్పాటు చేసిన నిపుణుల ప్యానెల్ సిఫార్సులను కూడా అప్పటి ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రి మనీష్ సిసోడియా విస్మరించారని రేఖ గుప్తా పేర్కొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై షర్మిల విసుర్లు

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు.. ప్రజల అంచనాలకు భిన్నంగా 30 మోసాలు, 60 అబద్ధాలు అనే సామెతను తలపించిందని విమర్శించారు. ఇవాళ(మంగళవారం) విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో షర్మిల మాట్లాడారు. గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారని.. కూటమి కరపత్రాన్ని చదివించారని మండిపడ్డారు. అరచేతిలో వైకుంఠం చూపించడం తప్పా.. మేనిఫెస్టో హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన ఎక్కడా లేదని అన్నారు. 8 నెలలు దాటినా ఇచ్చిన హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఇంకా ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలపై క్లారిటీ లేనే లేదని చెప్పారు. జాబ్ క్యాలెండర్ లాంటి మిగతా హామీలపై అసలు ప్రస్తావనే లేదని వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్ర పునర్ నిర్మాణం అంటూ కాలయాపన తప్పా.. పథకాలను అమలు చేస్తారని ఎదురుచూస్తున్న ప్రజలకు.. గవర్నర్ ప్రసంగం తీవ్ర నిరాశను మిగిల్చిందని అన్నారు. జలయజ్ఞం కింద చేపట్టిన దాదాపు 30 ప్రాజెక్టులు దశాబ్ద కాలంగా మూలుగుతుంటే .. వాటిని పూర్తి చేసే చిత్తశుద్ధి కూడా కూటమి ప్రభుత్వానికి లేదని చెప్పారు. రూ.3వేల నిరుద్యోగ భృతి కోసం 50 లక్షల మంది యువత% 84 లక్షల మంది విద్యార్థులు తల్లికి వందనం పథకం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఎకరానికి రూ.20 వేలు ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకం కోసం 54 లక్షల మంది రైతులు.. ఉచిత ప్రయాణం, నెలకు రూ.1500 ఇచ్చే మహాశక్తి పథకం కోసం కోటి మంది మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదన్నారు. పేదవాళ్లకు సొంత ఇంటి కోసం చేపట్టిన టిడ్కో ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడం లేదని చెప్పుకొచ్చారు. అందుకే ఈ నెల 28వ తేదీన ప్రవేశపెట్టే బడ్జెట్ ప్రజల ఆశయాలకు అద్దంపట్టేలా ఉండాలని,.. సూపర్ సిక్స్ హామీలను ఈ ఏడాది నుంచే అమలు చేసేలా నిధులు కేటాయించాలని, జాబ్ క్యాలెండర్ ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# శివరాత్రికి ముందే మహా కుంభమేళాకు పోటెత్తిన భక్తజనం

మొదటిపేజీ తరువాయి

ఈరోజు చివరి నాటికే 65 కోట్ల మంది వచ్చేలా ఉన్నారు. చివరిరోజు రేపటి తర్వాత ఈ భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో మహాశివరాత్రి కోసం ఇప్పటికే ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, రేపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహా కుంభమేళాకు హాజరై ఈ వేడుకను ముగించనున్నారు. రేపు ప్రయాగ్‌రాజ్‌లో మహాశివరాత్రి చివరి అమృతస్నానం కోసం భక్తులు శ్రీరాముని తపస్సు స్థలమైన చిత్రకూట్ నగరానికి పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. దీంతో చిత్రకూట్ జిల్లా యంత్రాంగం కూడా అన్ని సన్నాహాలు చేసింది. ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు చిత్రకూట్ గుండా ప్రవహించే పవిత్ర మందాకినీ గంగానదిలో స్నానం చేసి, ఆపై ఆలయంలో స్వామిని సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో భక్తులు లోతైన నీటిలోకి వెళ్లకుండా అధికార యంత్రాంగం జాగ్రత్తలు తీసుకుంది. దీంతో పాటు పలువురు భక్తులు మందాకినీ నదిలో పడవ ప్రయాణం కూడా ఆస్వాదిస్తున్నారు. ఇక మహా కుంభమేళా తర్వాత ఒకేసారి 15 వేల మంది పారిశుధ్య కార్మికులు శుభ్రత డ్రైవ్‌లో పాల్గొననున్నారు. ఇది సరికొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డును సృష్టిస్తుందని ఆయా వర్గాలు చెబుతున్నాయి. ఈ రికార్డు ఫలితాలను ఫిబ్రవరి 27న ప్రకటించనున్నారు.

# జనసేనలోకి వైసీపీ కార్పొరేటర్లు

తొలిఅడుగు, అమరావతి : ఒంగోలులో వైసీపీ బిగ్ షాక్ తగిలింది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో వైసీపీ కార్పొరేటర్లు చేరనున్నారు. ఒంగోలు కార్పొరేషన్‌లో 20 మంది వైసీపీ కార్పొరేటర్లతోపాటు ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు జనసేనలో చేరబోతున్నారు. బాలినేని శ్రీనివాస్ రెడ్డి వైసీపీకి రాజీనామా చేయడంతోనే.. ఒంగోలులో ఆ పార్టీ నిర్వీర్యమైందనే వాదన వినిపిస్తోంది. అనంతరం ఆయన వైసీపీ ఖాళీ చేయించే పనిలో ఉన్నారని సమాచారం. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంగోలు కార్పొరేషన్‌లో 41 మంది వైసీపీ కార్పొరేటర్లు, మేయర్ గెలుపొందారు. అయితే ఎన్నికల అనంతరం 19 మంది కార్పొరేటర్లు, మేయర్ కలిసి.. టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. దీంతో మిగిలిన కార్పొరేటర్లు.. బాలినేని శ్రీనివాసరెడ్డి టచ్‌లోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో వారంత ఈ రోజు జనసేన పార్టీలో చేరనున్నారు. జనసేనలో చేరుతోన్న ఈ కార్పొరేటర్లకు ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించనున్నారు. మరోవైపు వైసీపీలో అసంతృప్తిగా ఉన్న నేతలతో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వరుస చర్చలు జరుపుతోన్నారు. ఆ క్రమంలో పలువురు జనసేనలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. అసంతృప్తి నేతలను హైదరాబాద్ పిలుపించుకొని వారితో చర్చించి.. జనసేనలో చేరేలా వారిని ఒప్పిస్తున్నారు. దీంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైసీపీని ఖాళీ చేయాలనే ఓ విధమైన లక్ష్యంలో బాలినేని ముందుకు వెళ్తున్నారనే ఓ చర్చ సైతం జిల్లా వ్యాప్తంగా సాగుతోంది.

# ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

రిజర్వేషన్ల అంశంపై ప్రధాని మోదీతో సీఎం రేవంత్ చర్చించనున్నారు. రెండో విడత మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు అనుమతులతో పాటు రీజనల్ రింగ్ రోడ్ అంశంపై ప్రధానితో చర్చించనున్నారు. త్వరలోనే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై అసెంబ్లీలో చట్టం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అసెంబ్లీలో చట్టం చేసి దీన్ని కేంద్రానికి పంపిస్తామని.. దీన్ని కేంద్రం ఆమోదించేలా ఒత్తిడి తీసుకొస్తామని మంత్రులు తెలిపారు. అసెంబ్లీలో ఈ అంశంపై చట్టం చేయడానికి ముందే ఈ అంశాన్ని ప్రధాని మోదీకి వివరించాలని భావిస్తున్నారు సీఎం రేవంత్. ఇదే విషయాన్ని బుధవారం(ఫిబ్రవరి 26) జరగబోయే భేటీలో ప్రధాని మోదీకి వివరించనున్నారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసి పంపిస్తామని.. బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సహకరించాలని ప్రధానిని సీఎం రేవంత్ రెడ్డి అభ్యర్థించనున్నారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టి ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేయనున్నారు. తన ఢిల్లీ పర్యటనలో ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను సైతం సీఎం రేవంత్ కలవనున్నారని సమాచారం. మరోవైపు కాంగ్రెస్ అధిష్టానం పెద్దలను కూడా రేవంత్ రెడ్డి కలిసే అవకాశముంది. మంత్రివర్గ విస్తరణతో పాటు, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై పార్టీ అధిష్టానం పెద్దలతో రేవంత్ రెడ్డి చర్చించే అవకాశముంది.

# సన్నబియ్యం పంపిణీకి సిద్ధం




తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణలో పదేళ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ పేదలకు దగ్గర అయ్యేందుకు శతవిధాల ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగానే సన్న బియ్యం పండించేందుకు రైతులను ప్రోత్సహించిన ప్రభుత్వం, 500 రూపాయల బోనస్ సైతం ప్రకటించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సన్నబియ్యాన్ని ఎక్కువగా సాగు చేశారు. ఇప్పుడు ప్రభుత్వమే సన్న బియాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్రం ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్నబియ్యాన్ని నిరుపేదలకు ఉచితంగా అందించేందుకు రెడీ అవుతోంది. వచ్చే ఉగాది పండుగ నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యాన్ని ఇస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే ప్రకటించారు. దీంతో పేదలు రేషన్ షాపుల్లో సన్నబియ్యాన్ని పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఇస్తున్న దొడ్డు రకం బియ్యాన్ని చాలామంది తీసుకుంటున్న ప్పటికీ వాటిని వండుకుని తినే పరిస్థితి లేదు. దొడ్డు బియ్యం తీసుకువెళ్లి, వాటిని తిరిగి షాపుల్లో ఇచ్చేసి సన్నబియ్యాన్ని కొనుగోలు చేసుకుంటున్నారు పేదలు. అయితే ఈ విషయాన్ని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ గతంలో ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ షాపుల్లో సన్నబియ్యాన్ని సరఫరా చేస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు సన్నబియ్యాన్ని నిరుపేదలకు రేషన్ షాప్ ల ద్వారా అందించేందుకు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలోనే సన్నబియ్యాన్ని సరఫరా చేయాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో బియ్యం ధరలు షాక్‌కు గురిచేస్తున్నాయి. మార్కెట్లో రోజురోజుకూ బియ్యం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఎన్నడూలేని విధంగా బియ్యం రేట్లు పెరగడం సామాన్యులను ఆందోళనకు గురిచేస్తుంది. పెరిగిన బియ్యం రేట్లతో పేద, మధ్య తరగతి కుటుంబాలు బుక్కెడు మెతుకులు తినే పరిస్థితి కనిపించడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# వైసీపీ అంటే గుర్తొచ్చేది ఇదే

తొలిఅడుగు, అమరావతి : ఏపీ అసెంబ్లీలో వైసీపీ సభ్యుల తీరు చూస్తే పాలసీ టెర్రరిజం గుర్తుకు వచ్చిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విమర్శించారు. వైసీపీ పాలనలో ఏపీ సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. అసెంబ్లీలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసం గంపై ధన్యవాదాలు తెలిపే చర్చలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడారు. గవర్నర్ ప్రసంగానికి జనసేన పార్టీ తరపున, వ్యక్తిగతంగా తన తరపున ధన్యవాదాలు తెలిపారు. గతంతో ఇలాంటి సెషన్‌లు ఎప్పు డూ చూడలేదు... గొడవ ఎలా ఉంటుందో ఇప్పుడు చూడటమేనని పవన్ కల్యాణ్ అన్నారు. గతంలో గవర్నర్ ఈఎస్ఎల్ నర్సింహన్ ఉన్నప్పు డు తెలంగాణ అంశంలో ఇలాంటి గొడవ చూశానని పవన్ కల్యాణ్ గుర్తుచే శారు. అసలు అసెంబ్లీలో ఇలా ప్రవర్తించవచ్చా అని తనకు అనిపిస్తోందని అన్నారు. గవర్నర్ ప్రసంగం జరిగేటప్పుడు డిగ్నిటీని మెయింటెయిన్ చేయా లని రూల్ బుక్‌లో కూడా రాసి ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు. సభ్యులే ఈ రూల్‌ను బ్రేక్ చేస్తే ప్రజలకు ఏం చెబుతామని పవన్ కల్యాణ్ ప్రశ్నిం చారు. అసెంబ్లీలో గొడవలు జరిగితే కేసులు ఎందుకు పెట్టరని మంత్రి మనోహర్‌ను అడిగానని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఇక్కడ సభ్యులపై కేసులు పెట్టడం లేదంటే అన్ని విషయాలు మాట్లాడే స్వేచ్ఛ ఇచ్చారనే కదా అని పవన్ కల్యాణ్ చెప్పారు.

# 5 లక్షల కొత్త ఉద్యోగాలు

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయని గుర్తు చేశారు. బయో సైన్సెసలో పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న దార్శకనితతో ప్రభుత్వం ముందు నుంచి పని చేస్తోందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో త్వరలో లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీని నెలకొల్ప నున్నట్టు ప్రకటించారు. దేశ విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో భారతదేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని సీఎం గుర్తుచేశారు. “రాష్ట్రంలో అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పన ఉంది. ఇటీవల దావోసలో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో తెలం గాణ రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. వాటివల్ల విభిన్న రంగాలలో దాదాపు 50 వేల ఉద్యోగాలు రానున్నాయి. అలాగే, కిందటి సంవత్సరం లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.40వేల కోట్లకు పైగా పెట్టుబడులను విజయవంతంగా ఆకర్షించాం. దాదాపు 150 పైగా ప్రాజెక్టుల్లో ఈ పెట్టుబడులు వచ్చాయి” అని ఆయన వివరించారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రీన్ ఫార్మా సిటీ వేగంగా అభివృద్ధి చెందుతోందని, అతిపెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయని తెలిపారు. “వచ్చే పదేళ్లలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే కాక.. చైనా ప్లస్ వన్ (అంతర్జాతీయ కంపెనీలు తమ ఉత్పత్తిని చైనాతో పాటు మరో చోట కూడా ప్రారంభించే దిశగా చేస్తున్న యోచన) ఆలోచనలకు సరైన ప్రత్యామ్నాయ కేంద్రంగా తెలంగాణను అభివృద్ధి చేస్తున్నాం.” అని వివరించారు. కాగా.. ఈ సదస్సులో భాగంగా జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డ్-2025ను సింగపూర్‌కు చెందిన ప్రిసిషన్ హెల్త్ రిసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్యాట్రిక్ టాన్‌కు బహూకరించారు. అలాగే.. సదస్సు తొలిరోజునే 11 ఫార్మా కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం రూ.5400 కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకుంది.

హైదరాబాద్
తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# పరమేశ్వరుని దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రవీందర్ యాదవ్
- శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు



తొలిఅడుగు,శేరిలింగంపల్లి : పరమేశ్వరుని అనుగ్రహముతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శేరిలింగంపల్లి నేత రవీందర్ యాదవ్ ఆకాంక్షించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రవీందర్ యాదవ్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పర్వదినాన్ని ప్రజలంతా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆ పరమేశ్వరుని అనుగ్రహముతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, స్వామి ఆశిస్సులతో కెసిఆర్ మళ్ళీ సీఎం కావాలని, అప్పుడే సంక్షేమ ఫలాలు ప్రజలకు సమృద్ధిగా అందుతయని వెల్లడించారు. ప్రజలంతా ఈ పర్వదినాన్ని వేడుకగా జరుపుకోవాలన్నారు. మహా శివరాత్రి రోజున స్వామి వారి ఉపవాస దీక్ష లో ప్రజలందరూ భక్తితో కొలిచి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని, కోరిన కోర్కెలు నెరవేరాలి అని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాని రవీందర్ యాదవ్ కోరుకున్నారు.

# పట్టభద్రులు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి



తొలి అడుగు, చిన్న కోడూరు, ఫిబ్రవరి 25 : ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం చిన్నకోడూరు మండల కేంద్రం లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోర్డినేటర్ గా వచ్చినటువంటి సిద్దిపేట కౌన్సిలర్ సాకి ఆనంద్ , జిల్లా ప్రధానకార్యదర్శి షాబోద్దీన్ కలిసి పట్టభద్రుల ఓటర్ లిస్టులు 25 గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... పట్టభద్రులు 27 వ తేదీ రోజున ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4 గంటల లోపు ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి పట్టభద్రులు తప్పకుండ వేయాలని కోరారు. ఓటు వేసే ముందు ఓటర్లకు ఏమైనా సందేహాలు ఉంటే పోలింగ్ స్టేషన్ వద్ద అందుబాటులో ఉన్న కార్యకర్తలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమం లో మండల ఉపాధ్యక్షులు సందబోయిన పర్శరాం , ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి పొన్నాల రాజేష్, మండల కన్వీనర్ కొమ్ము ప్రశాంత్, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి పాకాల భూపతి రెడ్డి, ఫిషర్మెన్ జిల్లా కార్యదర్శి గుండు వెంకట్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ఉడుత ప్రశాంత్, వాసరి అజయ్, జిల్లా కార్యదర్శి జెల్ల అజయ్, ఆయా గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు గొట్టపర్తి చందు, నక్క రాజు, తాళ్లపల్లి రాజు,బర్ల స్వామి,ఎగుర్ల రాములు,బత్తుల మల్లేశం, కూన శ్రీను,నాయకులు కనకరాజు, నముండ్ల వినోద్,కొమ్ము రాజు,మిట్టపల్లి మహేష్, కోనేటి కరుణాకర్, అరుకలా శ్రీకాంత్, జంగిటి బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# పత్తిపాక పాఠశాలను సందర్శించిన ఎం.పి.డి.ఓ ప్రవీణ్ కుమార్



తొలి అడుగు, ధర్మారం, ఫిబ్రవరి 25 : పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక ప్రాథమిక పాఠశాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐ. ప్రవీణ్ కుమార్ మంగళవారం సందర్శించారు. పాఠశాలకు నూతనంగా మంజూరైన అదనపు తరగతి గదికి పంచాయితీ రాజ్ డిఈ రాజమౌళి, ఏఈ రాజశేఖర్ లతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్ ను సందర్శించి నిర్వాహకులను అభినందించారు .పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను, సానిటేషన్ ను పరిశీలన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన ఉచిత మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్ లు, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో గుణాత్మక విద్యను అందిస్తుందని కావున ప్రతీ ఒక్కరూ తమ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లయ్య, ఉపాధ్యాయులు గంద్రాతి శ్రీలత, గ్రామ పంచాయితీ సెక్రెటరీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రామంచ బడిలో స్వపరిపాలన దినోత్సవం




తొలిఅడుగు, చిన్నకోడూరు, ఫిబ్రవరి 25 : చిన్నకోడూరు మండలం రామంచ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ యాదగిరిరెడ్డి పాల్గొని విద్యార్థుల పనితీరును స్వయంగా పర్యవేక్షించి, పాఠశాల హెచ్ఎంగా బాధ్యతలు నిర్వర్తించిన అభిజ్ఞను అభినందించి తన పెన్నును బహుకరించాడు. ఈ సందర్భంగా డీఈఓ గా పి. జయ్ ,ఎంఇఓ గా ధనుష్ , ప్రధానోపాధ్యాయులుగా అభిజ్ఞ, కాంప్లెక్స్ హెచ్ఎం గా ఈశ్వర్, ఎంఎన్ఓ గా హరీష్, ఉపాధ్యాయులుగా తనుశ్రీ, అక్షిత, యోజిని, అనన్య, లక్ష్మణ్, మృణాళిని, శృతిక , సిరివెన్నెల , సింధూజ, ఆరాధ్య, ఉత్కర్షమహేశ్, వరుణ్ తేజ్, అరుణ్ కుమార్, రాము, ప్రసన్నాంజయ్ , ధనుష్ లు వ్యవహరించగా ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్లా షరీఫ్, అమ్మ కమిటీ చైర్మన్ భారతమ్మ, ఉపాధ్యాయులు, సురేష్ కుమార్, వరప్రసాద్, లలిత, సునీత, నాగమణి, వాణి పర్యవేక్షించారు. పాఠశాల నిర్వహణతో పాటు బోధనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు.

# వ్యవసాయ రంగంలోనూ వినియోగం.. సత్య నాదెళ్ల వీడియో వైరల్



తొలిఅడుగు, : వ్యవసాయంపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం అద్భుతంగా ఉందని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. మహారాష్ట్రలోని బారామతిలో ఒక చిన్న పొలం దిగుబడిని పెంచడానికి ఙూ× వాడకాన్ని ప్రస్తావిస్తూ ఆయన తన అధికారిక శ హ్యాండిల్ ద్వారా ఓ వీడియోను పంచుకున్నారు. ఇక్కడి చెరకు రైతుల కథను నాదెళ్ల వివరించారు. వారు కరువు, అప్పులు, పంటలను ప్రభావితం చేసే వివిధ వ్యాధులు, ఆత్మహత్యలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. అయితే ఇప్పుడు ఙూ× వారి అదృష్టాన్ని మార్చేసింది. రసాయనాలను తక్కువగా ఉపయోగించడం ద్వారా పంట దిగుబడిని పెంచడానికి, నీటి వినియోగాన్ని మెరుగుపరచడానికి ఙూ× రైతుకు ఎలా సహాయపడుతుందో ఈ వీడియో వివరిస్తుంది. ఙూ× రైతుల అదృష్టాన్ని మార్చిందని ఆయన అన్నారు. ఆయన షేర్ చేసిన వీడియోలో, చిన్న రైతులు ఙూ× యొక్క శక్తివంతమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం ద్వారా పంటల దిగుబడిని ఎలా పెంచుతున్నారో చూడవచ్చు. వ్యవసాయంపై ఙూ× ప్రభావాన్ని సత్య నాదెళ్ల అద్భుతంగా అభివర్ణించారు. మహారాష్ట్రలోని బారామతి ప్రాంతంలో రైతులు ఈ సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా వారు తమ పంటల దిగుబడిని పెంచుకున్నారని తెలిపారు. డ్రోన్లు, ఉపగ్రహాల నుంచి పొందిన జియోస్పేషియల్ డేటాను ఉపయోగించి, రైతులకు తమ భూమి పరిస్థితి గురించి తెలుసుకోవడం ద్వారా వారికి ఎంతో మేలు జరిగిందన్నారు. ఈ సాంకేతికత రైతుల భాషలో ఉండటం ద్వారా వారి పనులను మరింత సులభతరం చేస్తుందని ఆయన అన్నారు. ఈ క్రమంలో ఏఐ వినియోగం వల్ల పంటలకు రసాయనాల వినియోగాన్ని కూడా తగ్గించుకోవచ్చని సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. దీంతోపాటు రైతులు వారి పొలాల గురించి తెలుసుకుని, తక్కువ నీటితో పంటలను పండించుకోవచ్చన్నారు. ఇలా చేయడం ద్వారా వారి పొలాల్లో నీటి ఉత్పత్తిని మెరుగుపరుచుకుని, అధిక దిగుబడిని సాధించవచ్చున్నారు. వ్యవసాయానికి ఏఐ ఎంతో భవిష్యత్తునిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ప్రాచీన శిల్పకళకు ప్రతిరూపం ధర్మపురి శివాలయం

తొలిఅడుగు, : భారత దేశ ప్రాచీన సంస్కృతీ సభ్యతలకు నిలయంగా సనాతన సాంప్రదాయాలకు పుట్టినిల్లుగా, వేదవేదాంగ శాస్త్రాగమ, నృత్య గీత నాట్యాది సకల కళలయందు నిష్ణాతులైన ధార్మిక కార్యాదరణాసక్తులైన ప్రజానీకంతో, మరెచ్చటా కానరానన్ని ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్న పలు దేవాలయాల సముదాయం కలిగి, రాష్ట్రంలో సుప్రసిద్ధ ప్రాచీన పవిత్ర గోదావరి తీరస్థ తీర్థంగా, పుణ్య క్షేత్రంగా మిగుల ప్రాచుర్యం పొందింది నాటి అవిభక్త కరీంనగర్, నేటి నూతన జగిత్యాల జిల్లాలోని ధర్మపురి క్షేత్రం. శ్రీలక్ష్మీనరసింహ, శ్రీరామలింగేశ్వరస్వాముల దేవాలయాలు, మసీదూ పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ, ముస్లిం మత సామరస్యానికి సాక్షీ భూతంగా నిలిచియుంచీ క్షేత్రరాజం. గంభీర గౌతమీనది తీరాన వెలసి, అలనాటి శిల్పకళా చాతుర్యానికి ప్రతిబింబమై పౌరాణిక ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకుని దక్షిణ కాశిగా పేరెన్నిక గనుటకు మూలకారణమైనది ఈ క్షేత్రం లోని శ్రీరామచంద్ర స్థాపిత శ్రీరామలింగేశ్వరాలయం. భృగు మహర్షి త్రిమూర్తులను పరీక్షించిన నేపథ్యంలో, కైలాస మేగిన సందర్భంలో, నిత్యానందంలో మునిగి తేలుతూ, ఆ మహర్షి రాకను గమనింపని పార్వతీ పరమేశ్వరులను గాంచిన భృగు మహర్షి, శివుడు లింగరూపులో ఉంటూ, ఎవరిచేత పూజింపబ డకుండునట్లు శాపమిచ్చెనని పురాణాలు విశదీకరిస్తున్నాయి. తన శాప విముక్తి పరమ శివుడు, మహా విష్ణువును గురించి ఘోర తపస్సు చేయగా రామావతారంలో, ధర్మపురి క్షేత్రంలో స్వయంగా తాను లింగాన్ని ప్రతిష్టించి, పూజించి శాప నిమోచనం కలిగించ గలనని మహా విష్ణువు వరమిచ్చినట్లు స్థానిక పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి. రామావతారంలో దశరథుని ఆజ్ఞానుసారం వనవాస దీక్షలో, దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి క్షేత్రానికి ఏతెంచిన శ్రీరాముడు అలనాటికే వెలసి యున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఈశాన్యాన, సైకత (జసుల) లింగాన్ని ప్రతిష్ఠ చేసినట్లు, శ్రీరామునిచే స్థాపించ బడినందున శ్రీరామలింగేశ్వరుడని నామాండితుడై నట్లు స్థల పురాణం స్పష్టం చేస్తున్నది. ఆరవ శతాబ్దంలో స్థాపించబడి, ఎనిమిదవ శతాబ్దాంతం వరకూ వర్ధిల్లిన చాకుక్య రాజుల ప్రాభవంలో పునర్మించ బడిన రామేశ్వరాలయంలోని గణేశ విగ్రహములు అలనాటి శిల్పకళకు అద్దం పడుతున్నాయి. క్రీ.శ.973 నుండి 1140 వరకు పాలించిన కల్యాం చాళుక్యుల వంశానికి చెందిన విక్రమార్క బిరుదాంకితుడుగు ఆరవ విక్రముని (1076-1126) నాటి శిలాశాసనం ఈ ఆలయంలో ఉంది. ఇందులో ఈ చాళుక్యరాజు పరమేశ్వర, రణ రంగభైరవ, మార్వల భైరవ, ఆయత గంధ వారణ, విక్రమాదిత్య బిరుదులతో ప్రశంసింప బడినాడు. శాలివాహన శకం 1168 పరాభవ నామ సంవత్సర కాలం నాటి కాకతి గణపతి దేవుని శిలాశాసనం రామేశ్వరాలయంలో పూర్వపు చాళుక్య స్థంభం పైనే చెక్కబడి ఉంది. గణపతి దేవుడు ఇచటి రామేశ్వర, చండికల అంగరంగ వైభోగములకు గావించిన కొన్ని దానములు శాసనములలో పేర్కొనబడినవి. చాళుక్య శైలిలో బొజ్జ ఎత్తుగా నుండి, సహజమైన ఏనుగు తలను కలిగి, మానవ రూపంలేని గణపతి విగ్రహం ఆలయ సముదాయంలో నుంది. శివాలయ శిఖర నిర్మాణంలో చాళుక్య శైలి ఉంది. శిఖరం చాపాకృతిని పోలి. కిందనుండి పైకి ఎక్కుపెట్టిన విల్లులా ఉంది. శిఖర సౌందర్యానికి పైన ఆమలకములు వృత్తకారంలో చుట్టూరా కలిగి, ఆంతకుపైన కలశం, తూర్పున శుక నాసం ఉన్నాయి. శుక నాసం చిలుక ముక్కు లాగ ముందుకు పొడుచుకు వచ్చిన గూడు, శిఖర నిర్మాణం ఉత్కళ శైలిలో, లింగరాజ స్వామి ఆలయం (భువనేశ్వర్) దేవాలయ శఖరాకృతిని పోలి ఉంది. ప్రవేశ మంటపం తర్వాత దూరంగా గర్భాలయంలో మొదట ముఖ మంటపం ఉండి. మధ్యన గల రంగ శిల ప్రాచీనంగా నర్తకీమణుల వేదిక, నేడు అది వల్ల బండ.తర్వాత చీకటిగా.నుండే అంత రాళం, అపైన గర్భ గృహం. అందు శ్రీరామచంద్ర స్థాపిత సైకత (జముక) లింగం, ముఖ మంటపము, ప్రవేశ మంటపము, గర్భ గృహములు, ఆలయ ప్రాంగణంలో దాటితే శివుని దర్శనం. అలయ ప్రాంగణంలో మూడు ద్వారాలకు ఆభిముఖంగా నల్లరాతితో నిర్మించిన ఆభరణాలు అధికంగా గల, పీఠంపై ఉబ్బెత్తు హారాలు గలిగి, కాకతీయ ఆల యాలలోవలె శిలాకృతులు, జిలుగు నగిశీలు, మెడలో గంటలు, మువ్వల పట్టి, మెడ పట్టెడలు, గంగడోలు, వంపు తిరిగిన మెడ, వృహణాలతో నందులు ఉన్నాయి. పైకప్పుపై అపురూపాలైన ఏక ముఖ ద్వి దేహ నందులు నాలుగు మూలల ఉండేవి. సాలహార పునర్నిర్మాణ సమయంలో కూల్చి వేయడం జరిగింది. దేవాలయం కప్పుకన్నా ఎ త్తుగా, నిటారుగా 15ఆడుగుల ఎత్తు ఉన్న ధ్వజ స్థంభం (విజయ స్థంభం) ఉంది. శివాలయ ఈశాన్య భాగాన గణపతికి ప్రత్యేక గుడి ఉంది. ఇది కూర్చోని ఉన్న భారీ విగ్రహం. చాళుక్యుల కాలం నాటి విగ్రహానికి కుడి చేతులో గద ఉంది, నాగభంధం కలదు .ఎడమ చేతిలో గండ్రగొడ్డలి వంటి ఆయుధం, ఎడమ కింది చేతిలో మోదకాలు (ఉండ్రాళ్ళు) ఉన్నాయి. చెవులు చేటంత విశాలంగా ఉన్నాయి. రెండు వీర గల్లుల శిల్పాలున్నాయి. పదాతిదళపు వీరుడు శతృవులను చీల్చి చెండాడు తున్న దృశ్యం, ప్రాంగణం బయట నాగిని విగ్రహముంది. పైన నాగుల ఐదు పడగలతో కింద స్త్రీమూర్తి, చివర తోక, లేకుండా ఉంది. ఎనిమిది చేతుల మహిషాసుర మర్ధిని విగ్రహం ఉంది. అలాగే అపురూపాలైన బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ లేదా వరాహ పురాణంలో చెప్పబడిన యోగీశ్వరి ఆదిగా సప్తమాతృకల విగ్రహాలున్నాయి. ఓకే పీఠంపై చతురస్రాకార శిల్పమిది. ఇరు పార్శ్వా లలో గణపతి వీర భద్రుని విగ్రహాలు ఉన్నాయి. ప్రధాన దైవత లింగం కాక, ముఖ మంటపంలో వాయవ్యాన కాశీ విశ్వనాథుడు పేరుతో పూజలందుకునే 4 అడుగుల ఎత్తుగల లింగం ఉంది. దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి గోదావరిలో స్నానమాచరించి, శివ పూజ చేసేందుకు, హనుమంతుని లింగం తెమ్మని కాశీకి పంపగా, ప్రతి ప్రతిష్టించే సమయానికి ఆంజనేయుడు రాని స్థితిలో, సైకత లింగ ప్రతిష్ట గావించారని, ఆలస్యంగా ఏతెంచిన హనుమ సేవలు వ్యర్ధం కాకుండా, హనుమల్లింగాన్ని ప్రతిష్ఠచేసి, ఆ లింగాన్ని పూజించాకే, గర్భాలయంలోకి వెళ్ళేలా నియమం శ్రీరాముడు ఏర్పరచారని స్థల పురాణం స్పష్ట పరుస్తున్నది. ఆలయంలో 13వ శతాబ్ధం కాలంనాటి చండిక విగ్రహం కలదు. ఈ విగ్రహంలో అమ్మవారు చక్రస్తని, త్రిశూల, ఖడ్గహస్త, మకుట ధారిణి, చతుర్భుజ, శూల ధారిణిగా ఉంది. కాశీ విశ్వనాథుని పక్కన ప్రాచీన పార్వతీదేవి శిల్పం, మహిషాసుర మర్ధిని, షణ్ముఖుడు (కుమార స్వామి), ఉమా మహేశ్వరులు విడివిడిగా నల్ల శిలపై మలచబడి ఉన్నాయి. ఆలయంలో విక్రమాదిత్యుని, గణపతి దేవుని, ప్రధాన ద్వార కడప ముందర, బంకుళ్ళలో, దక్షిణ ప్రవేశ ద్వార స్థంభం, నైరుతి దిశలో ప్రహారీగోడ బాహ్యాది ఆరు శాస నాలున్నాయి. చుట్టూ రథం తిరిగేంత ప్రాంగణం, 10 అడుగుల ప్రహారీ కలిగి ఉన్నదీ ఆలయం. చారిత్రిక నేపథ్యం ప్రకారం, క్రీ.శ.1309లో ఢిల్లీనేలిన అల్లాఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాపూర్, ఇందూరు (నిజామాబాద్ ) మీదుగా ధర్మపురి మార్గంలో కాకతీయుల పైకి దండెత్తి వెళ్ళిన సమయంలో క్షేత్రంలోని రామేశ్వర, నృసింహాలయాలు ధ్వంసం చేయబడినవి. క్రీ.శ.1332-1367 మధ్యకాలంలో తెలంగాణా లోని వెలమ వీరుల సాయంతో, ముస్లింల నుండి దాస్య విముక్తి కలిగించిన ముసునూరి కాపయా మాత్యుని పాలనా కాలంలో, పరమహంస పరి వ్రాజకాచార్య నారాయణాశ్రమ స్వామి ఉభయ దేవాలయాలకు చేయూతనిచ్చి తిరిగి అర్చనాదు లకై కట్టుదిట్టం చేశారు. అబుల్ హసన్ తానాషా(1674-1687) మంత్రియగు మాదోభా నూజీ సూర్యప్రకాశ రావు మజుందార్ (మాదన్న మంత్రి) ఉభయ ఆలయాల అర్చనకు సహకరించారు. నాటినుండి స్థానిక దాతలైన విప్రవరుల, ఆర్యవైశ్యుల, భక్తుల సహకారంతో పూజా నైవేద్యాది విధివిదాన కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగిస్తూ, కొంతకాలం క్రితం దేవాలయం దేవాదాయ శాఖ ఆధీనంలోనికి తీసుకో బడింది. ఫలితంగా లక్ష్మీనరసింహ దేవస్థానంలో అంతర్భాగమైంది. వివిధ ధర్మకర్తల మండలుల కృషితో, దాతల చేయూ తతో నిధులను ప్రోగుచేసుకుని ముఖ్యమంత్రి సర్వశ్రేయో నిధి ద్వారా ప్రత్యేక నిధులు పొంది దేవాలయ పునరుద్ధరణ, సాలహార నిర్మాణం, అమ్మవారు, నంది, కలష, నవగ్రహ విగ్రహ ప్రతిష్టలు పూర్తి చేసుకుని , శృంగేరి శంకరాచార్య బహూకృత ఆదిశంకర, శారదామాత మూర్తులను ఆలయంలో ప్రతిష్టిం చడం జరిగింది. శివరాత్రి, శివ కళ్యాణం, రథోత్సవం, గణపతి నవగ్రహ పూజలు, శంకర జయంతి, శరన్నవరాత్రుల ఉత్సవాలను, నరసింహ స్వామివారల బ్రహ్మోత్సవ వేడుకలలో అంత ర్భాగంగా ఉత్సవాలను ఈ ఆలయంలో ఏడా సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఈఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అర్చకులు విశ్వనాథం, ప్రవీణ్ కుమార్, సిబ్బంది, ఏర్పాట్లు చేశారు.

# సంపాదకీయం

పాశ్చాత్య వైద్యురాలు ఆనందీబాయి

ఆనందీబాయి గోపాల్‌రావ్ జోషి మొదటి భారతీయ మహిళా వైద్యులలో ఒకరు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మెడిసిన్ పట్టభద్రులు కావడంతో పాటు, స్నాతకోత్తర విద్య ( పోస్ట్ గ్రాడ్యుయేషన్) పూర్తి చేసిన భారతీయ సంతతికి చెందిన మొదటి మహిళ ఆమె. భారత దేశం నుండి అమెరికన్ గడ్డపై అడుగు పెట్టిన మొదటి మహిళ కూడా ఆమెనే అని భావిస్తారు. ఆనందీ గోపాల్ జోషి లేదా ఆనందీబాయి జోషి (మార్చి 31, 1865 – ఫిబ్రవరి 26, 1887) పూణే (మహారాష్ట్ర) లోని సనాతన సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు యమున అని పేరు పెట్టారు. 9 సంవత్సరాల వయసులో దాదాపు ఇరవై సంవత్సరాలు పెద్దయిన గోపాల్ రావు జోషిని వివాహం చేసుకున్నారు. వివాహం తరువాత, ఆమె భర్త ఆమెకు ఆనందీబాయి అని పేరు పెట్టారు. గోపాల్ రావు, కళ్యాణ్ లో తపాలా గుమాస్తాగా పనిచేసేవారు. తరువాత, ఆయన అలీభాగ్, చివరకు కలకత్తా బదిలీ అయ్యారు. విద్య పట్ల ఆనందీబాయికి ఉన్న ఆసక్తి గమనించి, సంస్కృతం కంటే ఆంగ్ల భాష నేర్చుకోవడం ముఖ్యమని భావించారు. ఆంగ్లం నేర్చు కోవడానికి సహాయం చేశారు. 14 సంవత్సరాల వయస్సులో, ఆనందీబాయి ఒక బాలుడికి జన్మనిచ్చింది. అవసరమైన వైద్య సంరక్షణ అందుబాటులో లేక పోవడంతో బాలుడు పది రోజుల్లో చనిపోయాడు. ఈ సంఘటన ఆనందీబాయి జీవితంలో ఒక మలుపును తీసుకొచ్చింది. ఆమె వైద్యురాలు కావడానికి ప్రేరణనిచ్చింది. గోపాల్ రావు సామాజిక భావాలు కలిగిన వ్యక్తి. విద్య నేర్చుకోవడానికి ఆ రోజుల్లో ఆనాటి బ్రహ్మణుల కుటుంబాలలో మహిళలకు పరిమితులు ఉండేవి. విదేశాలకు బ్రాహ్మణులు వెళ్లడం నిషేధమైన కాలమది. అయినా ఆమె భర్త తన భార్య వైద్య శాస్త్రాన్ని అభ్యసించడానికి ప్రోత్సహించాడు. ఆమెకు అమెరికాలో విశ్వ విద్యాలయం ప్రవేశం కొరకు ప్రయత్నాలు సాగించారు. 1880 లో, ఆయన రాయల్ విల్డర్ (ఒక ప్రసిద్ధ అమెరికన్ మిషనరీ) కు వ్రాసిన లేఖలో ఆనందీబాయికి యునైటెడ్ స్టేట్స్‌లో వైద్య అధ్యయనం చేయడానికి గల ఆసక్తిని పేర్కొంటూ, తన కోసం అమెరికాలో సరైన ఉద్యోగానికై అభ్యర్థించారు.ఇద్దరు ఆలుమగలు క్రైస్తవ మతం స్వీకరిస్తే సహాయం చేయగలనని విల్డర్ ప్రతిపాదించాడు. అయితే ఈ ప్రతిపాదన జోషి దంపతులకు ఆమోదయోగ్యం కాలేదు. అయితే విల్డర్ ఈ ఉత్తరప్రత్యుత్తరాలను తన సొంత పత్రికైన ప్రిన్స్టన్ మిషనరీ రివ్యూలో ప్రచురించాడు. రొస్సెల్, న్యూజెర్సీకి చెందిన థియోడెసియా కార్పెంటర్ అనే మహిళ తన దంత వైద్యుని కోసం ఎదురుచూస్తూ ఆయన కార్యాలయంలో యాధృచ్ఛికంగా సదరు పత్రికలో ఆనందీబాయి గురించి చదివింది. వైద్యవిద్య చదవాలన్న ఆనందీబాయి తపన, దాన్ని ప్రోత్సహిస్తున్న భర్త యొక్క వృత్తాంతం ఆమెను కదిలించింది. ఆనందీబాయికి ఉత్తరం వ్రాసి తాను ఆనందీబాయి అమెరికాలో ఉండటానికి వసతి సహాయం చేయగలనని ముందుకు వచ్చింది. కార్పెంటర్‌కు, ఆనందీబాయికి మధ్య అనేక విషయాలపై ఉత్తరప్రత్యుత్తరాలు నడిచాయి. వారు పరస్పరం సాగించిన ఉత్తర ప్రత్యుత్తరాలలో బాల్యవివాహం కారణంగా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా ఒకటి కావటం విశేషం. " సెరంపోర్ కాలేజ్" హాలులో ఆనందీబాయి ఉపన్యసించిన సమయంలో తాను వైద్యవిద్యను అభ్యసించడానికి అమెరికా ఎందుకు వెళ్ళాలనుకుంటుందో వెల్లడించారు. ఆనందీబాయి, ఆమె భర్త అనుభవించిన ఇబ్బందుల గురించి తన ఉపన్యాసంలో వివరించారు. భారత దేశంలో హిందూ మహిళా వైద్యురాళ్ల అవసరం గురించి, అలాగే ఆమె భారత దేశంలో మహిళా వైద్య కళాశాల ప్రారంభించడం తన లక్ష్యమని వివరించారు. అయితే తాను క్రైస్తవ మతాన్ని స్వీకరించనని మాత్రం నొక్కి వక్కాణించారు. ఆమె ఉపన్యాసం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. భారతదేశం నలుమూలల నుండి ఆర్థికసహాయం చేస్తామని సందేశాలు ఆమె అందుకున్నారు. ఆమె విద్యకు సహాయంగా అప్పటి భారత వైస్రాయి కూడా 200 రుపాయల ఆర్థికసాయం పంపారు. భర్తకు అమెరికాలో ఉద్యోగం లభించని కారణంగా ఆనందీబాయి మాత్రం ఒంటరిగా ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికా వెళ్లారు. ఆనందీబాయి కలకత్తా నుండి న్యూయార్క్ వరకూ నౌకలో ప్రయాణం చేసారు. ఈ ప్రయాణంలో ఆమెకు తోడుగా ఇద్దరు ఆంగ్ల మహిళలు ఉన్నారు. విపరీతమైన వ్యతిరేకతల నడుమ ఆమె 1883 జూన్ మాసంలో వైద్య విద్యాభ్యాసానికి అమెరికాలో అడుగు పెట్టారు. 1883 జూన్ లో న్యూయార్క్‌లో ఈమెను స్వాగతించ డానికి కార్పెంటర్ వచ్చింది. అమెరికాలో మిసెస్ కార్పెంటర్ అతిథిగా ఆమె ఇంటికి చేరుకున్నారు. న్యూయార్క్ లో 1983లో థియోడిసియా కార్పెంటర్ ఆనందీబాయి బస, పోషణ బాధ్యత వహించింది. ఆనందీ, కార్పెంటర్ అత్యంత ఆత్మీయులుగా మారారు. కార్పెంటర్ ఆనందీబాయిని కుమార్తెగా భావించి అభిమానించింది. ఆనందిని చూసి కార్పెంటర్ విస్మయం చెందగా, అమెరికా వైవిధ్యం ఆనందినీని విస్మయ పరిచాయి. పెన్సిల్వేనియా మహిళా వైద్యకాలేజీలో వైద్యవిద్యకై ఆమె దరఖాస్తు చేసుకున్నారు. మొట్ట మొదటి మెడికల్ క్యాంప్ నిర్వహించిన పెంసెల్వేనియా మెడీకల్ కాలేజ్ వారికి ఆమె తనూ పాల్గొనేందుకై ఒక లేఖ వ్రాసారు. అదే ప్రపంచ మొట్టమొదటి మహిళా మెడికల్ క్యాంప్. (ఇది ప్రపంచంలోనే ఈ తరహా మొదటి కార్యక్రమం). రేచెల్ బాడ్లీ, కాలేజీ డీన్, ఆమెకు ఈ విద్యా కోర్సుకై అర్హతను ఇచ్చారు. ఫిలడెల్ఫియా విశ్వ విద్యాలయంలో ఆమెను వదిలిన సందర్భంలో కార్పెంటర్ పసిపిల్లలా విలపించడం వారి మధ్య అనుబంధాన్ని తెలియ జేస్తుంది. కాలేజీ సెక్రెటరీ, సూపరింటెండెంట్ సుదూరం నుండి విద్యాభ్యాసానికి వచ్చిన ఆనందీ గోపాలును చూసి ప్రభావితమై ఆమెకు అక్కడ ఉన్న 3 సంవత్సరాలు 600 అమెరికన్ డాలర్లను ఉపకార వేతనం ఏర్పాటు చేసింది. 19వ యేట ఆమె తన వైద్య విద్యను ప్రారంభించారు. అయితే ఆమె అమెరికాలో ఎదుర్కొన్న ప్రధాన సమస్య శీతోష్ణస్థితి. అయినా ఆమెకు కాలేజి వారు ఏర్పాటు చేసిన గదిలో సరైన " ఫైర్ ప్లేస్ " లేనందున ఫైర్ ప్లేస్ నుండి అత్యధికంగా పొగరావడం వలన ఆమెకు చలి కాని లేక పొగ కాని భరించ వలసిన పరిస్థితి ఎదురైంది. రెండు సంవత్సరాల అమెరికా వాసం తరువాత ఆమెకు అపస్మారకం, తీవ్రజ్వరం అధికమైంది. అప్పుడు మొదలైన దగ్గు ఆమెను చివరి వరకు వదిలి పెట్టలేదు.ఆమె తీవ్ర ఆరోగ్య సమస్యలతో మూడు సంవత్సరాల ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసి ఫైనల్ పరీక్షలు రాశారు. 1886 మార్చి 11 న ఆమె వైద్య విద్యలో డాక్టరేట్ సాధించింది. ఆమె పరిశోధనాంశం "ఆర్య హిందువులలో స్త్రీ జననాంగ – శిశు సంబంధిత వైద్యం".

స్నాతకురాలయిన సందర్భంలో విక్టోరియా మహారాణి ఆమెకు శుభాకాంక్షలతో ఒక సందేశాన్ని పంపారు. ఆమె పట్టభద్రోత్సవంలో ఆమె భర్త కూడా పాల్గొన్నాడు. ఆ ఉత్సవంలో ఆమెను మొట్టమొదటి భారతీయ వైద్యురాలుగా పేర్కొనడం ఆమెకు మరపురాని అనుభూతిని కలుగజేదిందని ఆమె తన కథనాలలో పేర్కొన్నారు. ఆమె ఆరోగ్యం రోజుకు రోజుకు దిగ జారడంతో ఆమె భర్త ఆమెను ఫిలడెల్ఫియా స్త్రీల ఆసుపత్రిలో చేర్చారు. ఆమెకు క్షయ వ్యాధిగా నిర్ధారించ బడింది. అయినా వ్యాధి ఇంకా ఊపిరి తిత్తులను చేరలేదు. వైద్యులు ఆమెను భారత దేశానికి తిరిగి వెళ్ళమని సలహా ఇచ్చారు. ఆమె నౌకాయానం చేసి విదేశాలకు వెళ్ళి సంప్రదాయ సరిహద్దులు దాటినందుకు ఆమెకు చికిత్స చేయడానికి నిరాకరించాడు. భారత దేశానికి తిరిగి వచ్చిన ఒక్క సంవత్సరం లోపుగానే ఫిబ్రవరి 26, 1887 తేదీన 22 సంవత్సరాల చిరుత ప్రాయంలో ఆనందీభాయి వ్యాధి బాధతో తుదిశ్వాస విడిచారు.

# ఎల్ఐసికి రూ.57 కోట్ల జిఎస్‌టి నోటీసు




తొలిఅడుగు, : దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉన్న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి)కు జిఎస్‌టి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆర్థిక సంవత్సరం 2020–21గాను అదనపు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి)కి సంబంధించి రూ.57.2 కోట్ల డిమాండ్ నోటీసును ఇచ్చారు. ఇది ఢిల్లీ అసిస్టెంట్ కమీషనర్ నుండి తమకు అందిందని ఎల్ఐసి సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఇందులో రూ.31.04 కోట్ల జిఎస్‌టి, రూ.23.13 కోట్ల వడ్డీ, రూ.3.10 కోట్ల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశాలు అందినట్లు వెల్లడించింది. ఇది తమ ఫైనాన్సియల్, నిర్వహణ, ఇతర కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపబోదని ఎల్ఐసి తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసి కొత్త వ్యాపార ప్రీమియం 21 శాతం వృద్ధితో రూ.43,075 కోట్లకు చేరింది. సంస్థ నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లుగా నమోదయ్యాయి. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా తగ్గి రూ.2,01,994 కోట్లుగా చోటు చేసుకుంది.

# బంగారం కొనుగోళ్లలో కొత్త ట్రెండ్..




తొలిఅడుగు, : భారతదేశంలో బంగారం కొనుగోలు చేసే విధానం వేగంగా మారుతోంది. ఒకప్పుడు బంగారు ఆభరణాలు కొనడంపై ఎంతో ఆసక్తి చూపేవారు. ఇప్పుడు ప్రజలు గోల్డ్ ఇటిఎఫ్, ఇతర ప్రత్యామ్నాయాలవైపు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా డేటా ప్రకారం, గోల్డ్ ఆభరణాలకు డిమాండ్ తగ్గుతూనే ఉంది. కానీ, బంగారు ఇటిఎఫ్‌లలో పెట్టుబడులు మాత్రం గణనీయంగా పెరుగుతున్నాయని వారు చెప్తున్నారు. భారతదేశంలో బంగారు ఆభరణాలకు డిమాండ్ గత మూడు సంవత్సరాలుగా క్రమంగా తగ్గుతోంది. 2021లో 610 టన్నుల బంగారం కొనుగోలు జరిగింది. ఇది 2022లో 600 టన్నులకు, 2023లో 575 టన్నులకు, ఇప్పుడు 2024లో 563 టన్నులకు పడిపోయిందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే 2022తో పోలిస్తే రికార్డు స్థాయిలో 7% తగ్గదలను గమనించవచ్చు. దీనికి అతి పెద్ద కారణం బంగారం ధరలో భారీ పెరుగుదల. 2024లో బంగారం ధర 15% పెరిగింది. దీని వలన సామాన్యులకు నగలు కొనడం అనేది ఖరీదైనదిగా మారింది. అలాగే, మొత్తం ధరలో 10–25% వరకు మేకింగ్ ఛార్జీలు తారెత్తిస్తున్నాయి. ఇవి కూడా జనాలు వీటిపై అనాసక్తి చూపడానికి ప్రధాన కారకంగా మారుతున్నాయి. అదనంగా, కొత్త తరం ఇప్పుడు బంగారాన్ని కుటుంబ వారసత్వ సంపదగా కాకుండా పెట్టుబడి కోణం నుండి మాత్రమే చూడటం ప్రారంభించింది. బంగారు కడ్డీలు, కాయిన్ లకు డిమాండ్ పెద్దగా హెచ్చుతగ్గులకు గురికాలేదు. కానీ బంగారు ఇటిఎఫ్‌లతో పోలిస్తే అవి బలహీనపడుతున్నాయి. 2021లో 186 టన్నుల బంగారు కడ్డీలు, కాయిన్ల కొనుగోలు జరిగింది. ఇది 2022 నాటికి 173 టన్నులకు తగ్గింది. అయితే, 2023లో అది 185 టన్నులకు పెరిగింది. 2024లో అది 239 టన్నులకు చేరుకుంది. అయితే, ఇది స్వల్పకాలిక ధోరణి అని నిపుణులు భావిస్తున్నారు. దీనికి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా కారణమవుతున్నాయి. మొత్తానికి బంగారం ధరలు పెరుగుతున్నాయి. దీర్ఘకాలంలో, బంగారు ఆభరణాల కంటే ఇటిఎఫ్ లు ఎక్కువ లాభదాయకమైన ఒప్పందంగా భావిస్తున్నారు. బంగారంతో పోలిస్తే బంగారు ఇటిఎఫ్‌లు కొనడానికి, అమ్మడానికి సులభంగా, సౌకర్యవంతంగా ఉండటం వల్ల కూడా ఈ పెరుగుదల నమోదయ్యి ఉండవచ్చు. దీనిని స్టాక్ ఎక్స్చేంజ్‌లో ఎప్పుడైనా అమ్మవచ్చు. ఇది చాలా ఆకర్షణీయమైన ఎంపికగా మారింది. ముఖ్యంగా యువ పెట్టుబడిదారులకు ఇదొక మంచి ప్రత్యామ్నాయంగా

# కొత్త 'హాఫ్‌టైమ్' ప్రచారాన్ని ప్రారంభించి కోకా-కోలా

తొలిఅడుగు,: కోకాకోలా కొత్త గేమ్-ఛేంజింగ్ ప్రచారం "హాఫ్‌టైమ్" ను ప్రారంభిస్తోంది, ఇది జీవితంలోని చిన్న పాజ్‌లను గమనించేందుకు, రీసెట్ అయ్యేందుకు మరియు కొత్త ఉత్సాహంతో తిరిగి ప్రారంభించేందుకు అభిమానులను ప్రేరేపిస్తుంది. క్రీడలలో హాఫ్‌టైమ్ ఇచ్చే ఎనర్జీ, వ్యూహం, పునరుద్ధరణ భావనల ఆధారంగా రూపొందించబడిన ఈ ప్రచారం, ఒక సాధారణ పాజ్‌ను అర్థవంతమైన అనుభవంగా మారుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రారంభించిన, హాఫ్‌టైమ్ ప్రచారం స్టోరీ టెల్లింగ్, బ్రాండ్ సినిమాలు మరియు డిజిటల్ అనుభవాల వినూత్న సమ్మేళనంతో, ఒక సాధారణ విరామం కొత్త దృక్పథాన్ని ఎలా తెస్తుందో చూపిస్తుంది, మరియు ఇందులో భారతదేశం ముందంజలో ఉంది, ఇక్కడ మొదటి చిత్రం కోకాకోలా యొక్క సిప్ ఆ క్షణాలను ప్రత్యేకమైనవిగా ఎలా మారుస్తుందో హైలైట్ చేస్తుంది. త్వరిత రీఛార్జ్ కోసం మ్యాచ్ మధ్యలో తక్షణ రీఛార్జ్ కోసం విరామం తీసుకునే ఆటగాళ్లనుంచి, జీవితంలో ముందుకు సాగడానికి హాఫ్ టైమ్ అవసరమనే సందేశాన్ని ఈ ప్రచారం మనకు గుర్తు చేస్తుంది. ఎమీా ఢిల్లీ ద్వారా రూపొందించబడిన ప్రేరణ గీతానికి, అవార్డు గ్రహీత దిబాకర్ బెనర్జీ దర్శకత్వం వహించగా, స్నేహా ఖాన్వాల్కర్ సంగీతం, ఖుల్లార్ జి సాహిత్యం అందించడంతో ఈ అనుభవం మరింత చిరస్మరణీయంగా ఉంటుంది. ఈ గీతం రోజువారీ క్షణాలను నిజమైన మరియు సాపేక్షమైన అనుభూతిని కలిగించే విధంగా సంగ్రహిస్తుంది, హాఫ్‌టైమ్‌ను జీవితంలో సహజ భాగంగా చేస్తుంది. బబితా బరువా, సీఈఓ, ఎమీా ఇండియా, ఇలా వివరించారు, "కోకాకోలా ఎల్లప్పుడూ సంస్కృతిని నిర్వచించే ప్రచారాలను రూపొందించింది, హాఫ్‌టైమ్ ప్రచారంతో మేము అదే సాధించామని నమ్ముతున్నాము. దాని ప్రధాన అంతర్దృష్టి విశ్వవ్యాప్తమైనది, మరియు ఈ ప్రచారం భారతదేశం నుండి ప్రారంభమవుతుందనే విషయం మాకు ఎంతో గర్వంగా ఉంది."



## సమ్మర్‌లో తాటికల్లుకు ఫుల్ డిమాండ్.. తాగితే ఎన్ని ప్రయోజనాలో..



**తొలిఅడుగు, ఆరోగ్యం ::** పల్లెటూర్లలో ఎక్కువ మంది ఉదయం, సాయంత్రం ఎంతో ఇష్టంగా తాటి కల్లు తాగుతుంటారు. మరీ ముఖ్యంగా తెలంగాణలో తాటికల్లు ఎక్కువ లభిస్తుంది. అంతే కాకుండా ఇక్కడ ఏ చిన్న ఫంక్షన్ జరిగినా సరే ఇక్కడ తాటి కల్లు ఉండాల్సిందే. ఇక ఈ తాటికల్లును చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు చాలా మంది ఎంతో ఇష్టంగా తాగుతుంటారు. ఎందుకంటే ఇది ఆరోగ్యానికి చాలా మంచిదంట. మరీ ముఖ్యంగా తాటికల్లుకు సమ్మర్‌లో ఫుల్ డిమాండ్ ఉంటుంది. అయితే కొంత మంది మాత్రం దీనిని అల్కహాల్‌గా భావించడమే కాకుండా తాగడానికి భయపడిపోతుంటారు. కానీ తాటి కల్లు తాగడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. అవి ఏవో ఇప్పుడు తెలుసుకుందాం. తాటి కల్లు ఆరోగ్యానికి చాలా మంచిది. కానీ ఇప్పటి రోజుల్లో చాలా వరకు కల్తీ కల్లు లభిస్తుంది. అయితే అందుకే ఎప్పుడూ కల్లు తాగినా.. చెట్టుపై నుంచి అప్పటికప్పుడు తీసే కల్లు మాత్రమే తాగాలి అంట. ఎందుకంటే ఇదులో అనేక ఔషధ గుణాలు ఉంటాయంట. తాటికల్లులో విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలంగా ఉంటాయి. అంతేకాకుండా విటమిన్ సీ, బీ, ఐరన్ ,ప్రొటిన్స్ కూడా పుష్కలంగా ఉండటం వలన దీని వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు దరి చేరవంట. మరీ ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంచడంలో తాటి కల్లు కీలక పాత్ర పోషిస్తుందంటున్నారు నిపుణులు. అలాగే శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుందంట, క్యాన్సర్‌కు చెక్ పెట్టడంలో ఇది కీలక పాత్ర పోషించడమే కాకుండా, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు యాంటి బయోటిక్‌గా తాటికల్లు పనిచేస్తుందంటున్నారు వైద్యులు. తీసుకున్న ఆహారం జీర్ణం కాకపోవడం, మలబద్ధకం, అల్సర్ వంటి సమస్యలు, ఉదర సంబంధ సమస్యలతో బాధపడే వారు ప్రతి రోజూ ఉదయం పరగడుపున తాటి కల్లు తాగడం వలన కల్లులో ఉండే ఔషధ గుణాలు కడుపును క్లీన్ చేసి సమస్యల నుంచి ఉపశమనం కలిగేలా చేస్తుందంట. అందుకే ఈ తాటికల్లుకు తెలంగాణాలో ఫుల్ డిమాండ్ ఉంటుంది అంటున్నారు నిపుణులు.

# వాడేసిన టీ డికాషన్‌ను పడేస్తున్నారా?



**తొలిఅడుగు, ఆరోగ్యం ::** ప్రతి ఉదయం నిద్రలేచిన వెంటనే టీ తాగడం చాలా మందికి అలవాటు. టీలో కెఫిన్ ఉండటం వల్ల నిద్రమత్తును చిటికెలో దూరం చేస్తుంది. టీ తాగిన తర్వాత దాదాపు అందరూ టీ ఆకులను పారవేస్తారు. కానీ ఆ ఉపయోగించిన టీ ఆకులను కూడా ఇతర పనులను ఉపయోగిచవచ్చని చాలా మందికి తెలియదు. చాలా మంది టీ తయారు చేసిన తర్వాత టీ డికాషన్‌ను మొక్కలకు ఎరువుగా ఉపయోగిస్తారు. కానీ ఆ టీ డికాషన్‌లో చక్కెర ఉంటే మొక్క చనిపోయే ప్రమాదం ఉంది. నిజానికి టీ డికాషన్‌లో పెద్ద మొత్తంలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. శరీరంపై ఎక్కడైనా గాయం తగిలితే వినియోగించిన టీ డికాషన్‌ను ఆ ప్రాంతంలో వినియోగించవచ్చు. తద్వారా గాయం త్వరగా నయం అవుతుంది. రోజులో ఎక్కువ సమయం కంప్యూటర్‌తోనే గడిపితే కళ్లు త్వరగా అలసిపోతాయి. దీనికి ఉపశమనం పొందాలంటే శుభ్రమైన గుడ్డలో వినియోగించిన టీ డికాషన్‌ను ఉంచి కళ్ళపై మెల్లగా కాపడం పెట్టవచ్చు. ఇది కళ్ళకు విశ్రాంతి ఇచ్చి, చూపును మెరుగుపరుస్తుంది. అయితే వినియోగించిన టీ డికాషన్‌ను ఉపయోగించడానికి ముందుగా వాటిని శుభ్రమైన నీటితో కడగాలి. ఇలా చేయడం వల్ల చక్కెరలోని తీపి పోతుంది. ఆ టీ ఆకును వివిధ అవసరాలకు అనుగుణంగా ఉపయోగించవచ్చు. పప్పు, కూరగాయలు వంటి ఇతర అహార పదార్థాలను పాత్రలలో వండినప్పుడు అవి జిడ్డుగా మారుతాయి. నీటితో కడిగిన తర్వాత కూడా జిడ్డు త్వరగా వదలదు. పాత్రలపై జిడ్డును తొలగించడానికి టీ డికాషన్‌ను బాగా మరిగించాలి. అనంతరం కాచిన టీ నీటితో పాత్రలను శుభ్రం చేస్తే.. తళతళ మెరుస్తాయి. ఇంట్లో దోమలు, ఈగలు అధికంగా ఉంటే వాటిని వదిలించుకోవడానికి ఉపయోగించిన టీ డికాషన్ బలేగా పనిచేస్తాయి. ముందుగా వాడిన టీ డికాషన్‌ను ఒక కుండ నీటిలో మరిగించాలి. ఆ తర్వాత నీటిని చల్లబరిచి దానితో ఇంటి మొత్తాన్ని గుడ్డతో తుడవాలి. ఇలా చేయడం వల్ల ఇంట్లోని దోమలు, ఈగలు రెండూ పరారవుతాయి.

# పసుపు జీలకర్ర నీరు తాగితే ఎన్ని లాభాలా?



**తొలిఅడుగు, ఆరోగ్యం ::** పరగడుపున పసుపు జీలకర్ర నీరు తాగొచ్చా..? దీని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటి..? జీలకర్ర, పసుపును నీటిలో కలిపి తయారుచేసే ఈ సాధారణ డ్రింక్ ప్రతిరోజూ ఉదయం పరగడుపున తీసుకుంటే మన శరీరానికి అనేక అద్భుతమైన ప్రయోజనాలను కలిగిస్తుంది. ప్రతిరోజూ ఉదయం కాఫీ టీ తాగడానికి బదులుగా ఈ ఆరోగ్యకరమైన డ్రింక్ ని తాగడానికి ప్రయత్నించండి. పరగడుపున పసుపు జీలకర్ర నీరు తాగడం వల్ల కలిగే ముఖ్యమైన ప్రయోజనాలలో ఒకటి జీర్ణక్రియను పెంచే సామర్థ్యం. జీలకర్ర, పసుపు రెండూ వాటి జీర్ణ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. వాటిని కలిపితే అవి జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపించగలవు. పోషకాల శోషణను ప్రోత్సహించగలవు. ఉబ్బరం, గ్యాస్ ను తగ్గించగలవు. మీరు బరువు తగ్గాలని చూస్తున్నట్లయితే ఈ జీలకర్ర పసుపు మీ బరువు తగ్గే ప్రయాణంలో మీకు ఎంతగానో సహాయపడుతుంది. జీలకర్ర దాని జీవక్రియను పెంచే లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. అదే సమయంలో పసుపు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ రెండు బరువు నిర్వహణకు చాలా ముఖ్యమైనవి. జీలకర్ర పసుపు నీరు యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ సమ్మేళనాల పవర్ హౌస్. ఇది మీ రోగనిరోధక వ్యవస్థను పెంచడానికి సహాయపడుతుంది. ఈ పానీయాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా మీరు ఇన్ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా మీ శరీరం రక్షణను బలోపేతం చేసుకోవచ్చు. ఇది మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సుకు దారితీస్తుంది. నీటిలో జీలకర్ర, పసుపు కలయిక మీ చర్మానికి అద్భుతాలు చేస్తుంది. రెండు పదార్థాలు వాటి యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఇది మొటిమలని తగ్గించడానికి, చర్మ ఆకృతిని మెరుగుపరచడానికి, మీకు కాంతివంతమైన రూపాన్ని అందించడానికి సహాయపడుతుంది. జీలకర్ర పసుపు నీరు సహజమైన డిటాక్సిఫైయర్‌గా పనిచేస్తుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరచడానికి, శరీరం నుండి టాక్సిన్‌లను తొలగించడానికి సహాయపడుతుంది. ఈ పానీయాన్ని పరగడుపున తీసుకోవడం ద్వారా మీరు మీ శరీరం నిర్విషీకరణ ప్రక్రియను ప్రారంభించి మంచి ఆరోగ్యాన్ని ప్రోత్సహించవచ్చు. పరగడుపున జీలకర్ర కలిపిన నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ, రోగనిరోధక శక్తిని పెంచడం నుండి బరువు తగ్గడానికి సహాయపడటం, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వరకు ఈ సాధారణ డ్రింక్ మీ మొత్తం శ్రేయస్సుకు అద్భుతాలు చేస్తుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఈ లక్షణాలు... కిడ్నీల్లో రాళ్లు ఉన్నట్లే!



**తొలిఅడుగు, ఆరోగ్యం ::** భారతదేశంలో కిడ్నీలో రాళ్ల సమస్య పెరుగుతోంది.. పెద్ద సంఖ్యలో ప్రజలు దీనికి బలైపోతున్నారు. మూత్రపిండాలు మన శరీరంలో చాలా ముఖ్యమైన అవయవం.. దాని ప్రధాన విధి రక్తాన్ని ఫిల్టర్ చేయడం.. ఈ ప్రక్రియ జరిగినప్పుడు కాల్షియం, సోడియం, అనేక రకాల ఖనిజాల కణాలు మూత్ర నాళం ద్వారా మూత్రాశయానికి చేరుతాయి. భారతదేశంలో కిడ్నీలో రాళ్ల సమస్య పెరుగుతోంది.. పెద్ద సంఖ్యలో ప్రజలు దీనికి బలైపోతున్నారు. మూత్రపిండాలు మన శరీరంలో చాలా ముఖ్యమైన అవయవం.. దాని ప్రధాన విధి రక్తాన్ని ఫిల్టర్ చేయడం.. ఈ ప్రక్రియ జరిగినప్పుడు కాల్షియం, సోడియం, అనేక రకాల ఖనిజాల కణాలు మూత్ర నాళం ద్వారా మూత్రాశయానికి చేరుతాయి. ఈ వస్తువుల పరిమాణం పెరగడం ప్రారంభమైన తరువాత అవి ఘనీభవించి రాయి అకారాన్ని తీసుకోవడం ప్రారంభిస్తాయి.. దీనిని రాళ్లుగా పిలుస్తారు. కిడ్నీలో రాళ్ల సమస్య ఉన్నవారు తమ ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.. లేకుంటే కిడ్నీల్లో రాళ్ల ప్రమాదం మరింత పెరిగి.. అత్యవసర పరిస్థితికి దారితీసే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మూత్రపిండాల్లో రాళ్లతో బాధపడేవారు.. మూత్ర విసర్జన చేసేటప్పుడు నొప్పి, తరచుగా టాయిలెట్‌కు వెళ్లడం, కడుపు నొప్పి, ఆకలి లేకపోవడం, నడుము ప్రాంతంలో నొప్పి.. వికారం గురించి ఫిర్యాదు చేస్తారు.. అటువంటి పరిస్థితిలో అలాంటి వారు.. కొన్ని ఆహారాలకు దూరంగా ఉండటం ముఖ్యం.. డైటీషియన్‌ల ప్రకారం.. కిడ్నీల్లో రాళ్లు ఉన్న వారు కొన్ని ఆహారాలకు దూరంగా ఉండాలి.. లేకపోతే.. ఈ సమస్య మరింత పెరుగుతుంది.. మూత్రపిండాల్లో రాళ్ల సమస్యతో బాధపడే వారు ఎలాంటి ఆహారాలను తినకూడదో ఇప్పుడు తెలుసుకోండి. విటమిన్ సి ఆధారిత ఆహారాలు: రాళ్ల సమస్య ఉన్నట్లయితే, విటమిన్ సి పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. దీని కారణంగా మరిన్ని రాళ్ళు ఏర్పడటం ప్రారంభిస్తాయి. నిమ్మ, పాలకూర, నారింజ, అవాలు, కివి, జామ వంటి వాటిని తినడం మానేయడం మంచిది.

ఉప్పు: మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నవారు ఉప్పు, అత్యధిక ఉప్పు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం తగ్గించాలి. ఎందుకంటే వాటిలో అధిక మొత్తంలో సోడియం ఉంటుంది..

# టీలో దాల్చిన చెక్క కలిపి తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు



**తొలిఅడుగు, ఆరోగ్యం :** మీరు రోజూ టీ తాగే అలవాటు ఉన్నవారైతే ఇది మీకు ఉపయోగకరంగా ఉంటుంది. బాడీలో షుగర్ లెవెల్స్ నియంత్రించడం ముఖ్యమైనది. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారికి లేదా వచ్చే అవకాశం ఉన్నవారికి.. టీ తాగడం ఆపేయడానికి కష్టమైతే దానిలో చిన్న మార్పు చేసి రక్తంలో షుగర్ స్థాయిని నియంత్రించవచ్చు. రోజూ టీతో పాటు చిటికెడు దాల్చిన చెక్క వేసినా ప్రయోజనాలుంటాయి అంటున్నారు నిపుణులు. దాల్చిన చెక్కలో బయోఆక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. అందులో ముఖ్యంగా సినామాల్డిహైడ్ అనే పదార్థం ఇన్సులిన్ పనితీరును మెరుగుపరిచే లక్షణాలను కలిగి ఉంటుంది. పరిశోధనల ప్రకారం దాల్చిన చెక్క ఇన్సులిన్ లాగా పనిచేసి గ్లూకోజ్‌ను కణాల్లోకి త్వరగా తీసుకువెళ్లేందుకు సహాయపడుతుంది. ఇన్సులిన్ ప్రతిస్పందనను మెరుగుపరిచేలా దాల్చిన చెక్క పనిచేస్తుంది. దీని వల్ల అధిక ఇన్సులిన్ అవసరం తగ్గుతుంది. ఇది ప్రత్యేకంగా ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఉన్నవారికి లేదా టైప్-2 డయాబెటిస్ ఉన్నవారికి సహాయపడుతుంది. టీ ముఖ్యంగా గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి మెటబాలిజం మెరుగుపరచడంతో పాటు శరీరంలో వాపు తగ్గించడంలో సహాయపడతాయి. టీలో దాల్చిన చెక్క వేస్తే రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలు పెరుగుతాయి. వీటి కలయిక ఇన్సులిన్ ప్రభావాన్ని మెరుగుపరిచేలా పని చేస్తుంది. షుగర్ శరీరంలో త్వరగా ప్రవేశించకుండా నియంత్రించడం వల్ల భోజనం తర్వాత రక్తంలో షుగర్ స్థాయిలు స్థిరంగా ఉండేందుకు సహాయపడుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి భోజనం తర్వాత వచ్చే షుగర్ పెరుగుదలను నియంత్రించడం చాలా అవసరం. టీకి దాల్చిన చెక్క కలిపితే గ్లూకోజ్ శరీరంలో మెల్లగా ప్రవేశించేలా చేస్తుంది. దాంతో రక్తంలో షుగర్ స్థాయి అకస్మాత్తుగా పెరగకుండా నియంత్రించవచ్చు. దీని వల్ల డయాబెటిస్ మందుల స్థానంలో దాల్చిన చెక్క పూర్తిగా ఉపయోగించలేనప్పటికీ దీన్ని ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం భాగంగా చేర్చుకోవచ్చు. కొన్ని అధ్యయనాలు చూపించిన ప్రకారం దీర్ఘకాలం దాల్చిన చెక్క తీసుకుంటే ఉపవాస సమయంలో బ్లడ్ షుగర్ స్థాయిలు కొంతమేరకు తగ్గవచ్చని భావిస్తున్నారు. టీలో దాల్చిన చెక్క కలపడం చాలా సులభం. మీరు చేసిన టీలో చిటికెడు దాల్చిన చెక్క పొడి వేసి బాగా కలిపితే సరిపోతుంది. రుచిని మరింత పెంచాలనుకుంటే టీ తయారయ్యేటప్పుడు దాల్చిన చెక్క కడ్డిని నేరుగా ఉంచి మరిగించవచ్చు. తీపి రుచిని పెంచాలని అనుకుంటే దాల్చిన చెక్కను అల్లం, లవంగం లాంటి సహజమైన పదార్థాలతో కలిపి ఉపయోగించవచ్చు. ఈ విధంగా రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# త్రిషకు ఉన్న ఫాలోయింగ్ ఏమాత్రం తగ్గలేదు

తొలిఅడుగు, సినిమా ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో త్రిష మోస్ట్ వాంటెడ్ హీరోయిన్. 41 ఏళ్ల వయసులోనూ త్రిష ఇప్పటికీ ఎంతో క్యూట్ గా అందంగా కనిపిస్తుంది. ఇప్పటికీ త్రిషకు ఉన్న ఫాలోయింగ్ ఏమాత్రం తగ్గలేదు. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో అలరిస్తుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ క్రేజీ పిక్స్ షేర్ చేసింది ఈ అమ్మడు. బ్యాక్ టూ బ్యాక్ అగ్ర హీరోల సరసన అవకాశాలు అందుకుంటూ ఫుల్ బిజీగా ఉంది హీరోయిన్ త్రిష. పొన్నియన్ సెల్వన్ సినిమాతో కంబ్యాక్ ఇచ్చిన ఈ హీరోయిన్ ప్రస్తుతం వరుస సినిమాలతో అలరిస్తుంది. పొన్నియన్ సెల్వన్ తర్వాత త్రిషకు ఎక్కువగా తమిళంలోనే ఆఫర్స్ వచ్చాయి. విజయ్ దళపతి, అజిత్ వంటి స్టార్ హీరోలతో వరుస సినిమాల్లో నటిస్తుంది. అలాగే కమల్ హాసన్ థగ్ లైఫ్ మూవీలో నటిస్తుంది. ఇటు తెలుగులోనూ మెగాస్టార్ చిరంజీవి సరసన విశ్వంభర చిత్రంలో నటిస్తుంది. స్టాలిన్ సినిమా తర్వాత వీరిద్దరు కలిసి నటిస్తున్న సినిమా ఇదే. ఈ సినిమాతోపాటు మరిన్ని ఆఫర్స్ అందుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం వరుస ఆఫర్స్ అందుకుంటూ కుర్ర హీరోయిన్లకు గట్టిపోటినిస్తుంది త్రిష. ఒకప్పుడు బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో అలరించిన ఈ అమ్మడు.. ఇప్పుడు సైతం అదే జోరు కొనసాగిస్తుంది. ఆమె నటిస్తున్న సినిమాలపై అంచనాలు ఉన్నాయి. మరో ఐదారేళ్లపాటు ఈ అమ్మడి క్రేజ్ కొనసాగేలా కనిపిస్తుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. పర్పుల్ కలర్ డ్రెస్ లో నీలికళ్లతో మాయ చేస్తుంది.



## వేసవి కానుకగా 'సారంగపాణి జాతకం'



తొలిఅడుగు, సినిమా : సకుటుంబ సపరివార సమేతంగా చూడదగ్గ వినోదాత్మక చిత్రాలకి పేరొందిన శ్రీదేవి మూవీస్ పతాకంపై మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించిన పూర్తి నిడివి హాస్య చిత్రం 'సారంగపాణి జాతకం' వేసవి సెలవుల్లో నవ్వులు పంచడానికి సిద్ధంగా ఉంది. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించిన ఈ చిత్రం నుండి ఇటీవల విడుదలైన టైటిల్ సాంగ్ 'సారంగో సారంగా', 'సంచారి సంచారీ' పాటలు ట్రెండ్ అవుతుండగా, టీజర్‌లోని మాటలు, హాస్య సన్నివేశాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత భారీ అంచనాల మధ్య మోహనకృష్ణ ఇంద్రగంటి, శ్రీదేవి మూవీస్ కలయికలో మూడో చిత్రంగా విడుదలవ్వనున్న 'సారంగపాణి జాతకం' గురించి నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. "వేసవి సెలవుల్లో కుటుంబమంతా కలిసి వెళ్ళి చూసే పరిపూర్ణ హాస్యరస చిత్రం మా 'సారంగపాణి జాతకం'. మా దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి అద్భుతంగా తీశారు. ఆద్యంతం కట్టిపడేస్తూనే, వచ్చే ఎండలకి సాంత్వనలా అందరినీ అలరిస్తుందీ సినిమా" అని అన్నారు.

# 'నారి' ఓ మంచి ప్రయత్నం

తొలిఅడుగు, సినిమా: 'మహిళల గురించి ఒక మంచి కథతో 'నారి' సినిమాను రూపొందించినట్లు ట్రైలర్‌తో తెలుస్తుంది. ట్రైలర్ చాలా బాగుంది. కొత్త ప్రొడ్యూసర్, డైరెక్టర్ ఇలాంటి మంచి ప్రయత్నం చేయడం సంతోషకరం. ఆమని గారు మావిచిగురు, శుభలగ్నం లాంటి మూవీస్‌తో తెలుగు ప్రేక్షకులకు గుర్తిండిపోయారు. మా సంస్థలో ఎంసిఎ, శ్రీనివాస కళ్యాణం మూవీస్‌లో నటించారు. 'నారి' సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని ఈ టీమ్‌కు సజెస్ట్ చేస్తున్నా. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్' అని నిర్మాత దిల్‌రాజు అన్నారు. ఆమని, వికాస్ వశిష్ఠ, మౌనికరెడ్డి, ప్రగతి, సునయన, కేదార్ శంకర్, ప్రమోదినీ తదితరులు కీలక పాత్రల్లో నటించిన సినిమా 'నారి'. 'మహిళల్ని గౌరవించాలి, ఆడపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి' అనే కాన్సెప్ట్‌తో దర్శకుడు సూర్య వంటిపల్లి ఈ చిత్రాన్ని రూపొందించారు. నిర్మాతగా శశి వంటిపల్లి నిర్మించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి ఏడోతేదీన ఈ సినిమాను విడుదల చేయనున్నారు. శనివారంనాడు ట్రైలర్‌ను దిల్‌రాజు విడుదల చేశారు.



# నేరస్థుల రక్తం కళ్లజూసే 'హిట్' లాఠీ

తొలిఅడుగు, సినిమా న్యాచురల్ స్టార్ నాని నిర్మాతగా శైలేష్ కొలను దర్శకత్వంలో హిట్ 1, హిట్ 2 ఎంత పెద్ద హిట్టయ్యాయో తెలిసిందే. విశ్వక్ సేన్, అడవి శేష్ కు మంచి బ్రేక్ గా నిలిచిన ఈ సిరీస్ లో మూడో కేస్ నాని స్వయంగా టేకప్ చేయడంతో ప్రాజెక్టు ముందు నుంచి దీని మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇవాళ నాని పుట్టినరోజు సందర్భంగా టీజర్ రిలీజ్ చేశారు. మే 1 విడుదల కాబోతున్న ఈ క్రైమ్ థ్రిల్లర్ గతంలో ఎప్పుడూ చూడనంత వయొలెన్స్ ఉంటుందని టీమ్ అప్పుడప్పుడు చెబుతూనే వచ్చింది అది ఎంత మోతాదులో ఉందో ఇవాళ శాంపిల్ రూపంలో చూపించారు. ఊహించని షాకులు బోలెడిచ్చారు. ఎక్కడో కాశ్మీర్ దగ్గరలో ఒక సుదూర ప్రాంతాలు. చాలా దారుణమైన కొన్ని హత్యలు జరుగుతాయి. ఎవరు చేస్తున్నారో అర్థం కాక దీన్ని పరిష్కరించేందుకు అర్జున్ సర్కార్ (నాని) ని పిలిపిస్తారు. లాఠీనే ఆయుధంగా చేసుకునే అర్జున్ కి జాలిదయా ఉండవు. తప్పు చేసిన వాడు, నేరస్థుడు దొరికితే చాలు ఎందుకు మనిషి జన్మ ఎత్తామా అనిపించేలా చితకబాది రక్తం బయటికి తీస్తాడు. అలాంటి పోలీస్ ఆఫీసర్ కు సీరియల్ మర్డర్స్ కేస్ సవాల్ గా మారుతుంది. అప్పటిదాకా చేసిన ఆపరేషన్లకు భిన్నంగా దీనికి ఇంకా వయొలెంట్ మోడ్ లోకి వెళ్లాల్సి వస్తుంది. అసలు ఇంతకీ ఇదంతా చేసింది ఎవరనేది అసలు స్టోరీ. ముఖ్యంగా నాని



# రేసు రసవత్తరం



తొలిఅడుగు, రావల్పిండి: చాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియాకు, వర్షానికి అవినాభావ సంబంధం ఉన్నట్టుంది. 2009వ ఎడిషన్ నుంచి ఆ జట్టు ఈ టోర్నీలో ఆడిన 8 మ్యాచ్‌లలో వర్షం కారణంగా మ్యాచ్ రద్దు అవడం ఇది నాలుగోసారి. రావల్పిండి వేదికగా దక్షిణాఫ్రికాతో జరగాల్సిన మ్యాచ్ వాన వల్ల టాస్ కూడా పడకుండానే రైద్దెంది. దీంతో ఇరు జట్లు తలా ఒక పాయింట్ పంచుకున్నాయి. ఆసీస్, సఫారీ మ్యాచ్ రద్దవడంతో గ్రూప్- బీ లో సెమీస్ పోరు రసవత్తరంగా మారింది. ఈ గ్రూప్‌లో ఉన్న నాలుగు జట్లకూ సెమీస్ అవకాశాలు ఉన్నాయి. అవి ఎలాగంటే..

2 బెర్తులు.. 4 జట్లు

గ్రూప్–బీ లో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తలా ఒక మ్యాచ్ గెలిచి మరో మ్యాచ్ రద్దవడంతో చెరో 3 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. తమ తొలి మ్యాచ్‌లలో ఓడిన ఇంగ్లండ్, అఫ్గానిస్థాన్ ఇంకా ఖాతా తెరవలేదు. ఆస్ట్రేలియా, సఫారీలు తమ తర్వాతి మ్యాచ్‌లలో గెలిస్తే మిగిలిన సమీకరణాలతో సంబంధం లేకుండా ఆ జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. కానీ ఇంగ్లండ్, అఫ్గానిస్థాన్‌లతో జరిగే తమ చివరి మ్యాచ్‌లలో ఓడితే అప్పుడు ఆ జట్లకు తిప్పలు తప్పవు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంగ్లండ్, అఫ్గాన్ పోరు.. సెమీస్ రేసులో అన్ని జట్లకూ కీలకం కానుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు.. టాప్–2 టీమ్స్‌తో సెమీస్ ఆశలను సజీవంగా నిలుపుకుంటుంది. ఓడిన జట్టు తట్టాబుట్టా సర్దుకోవడమే.

నేటి మ్యాచ్ కూడా రైద్దతే..!

ఒకవేళ వర్షం కారణంగా బుధవారం ఇంగ్లండ్, అఫ్గాన్ మ్యాచ్ కూడా రద్దు అయితే అప్పుడు సెమీస్ రేసు మరింత రసవత్తరమవుతుంది. ఇంగ్లండ్.. తమ చివరి మ్యాచ్‌లో సఫారీలను ఓడించి.. అఫ్గాన్లు కంగారూలను మట్టికరిపిస్తే అప్పుడు నాలుగు జట్లకూ తలా 3 పాయింట్లు చేరతాయి. అప్పుడు నెట్ రన్ రేట్ కీలకమవుతుంది. ప్రస్తుతం సౌతాఫ్రికా.. ం2.140 నెట్ రన్‌రేట్‌తో అగ్రస్థానంలో ఉండగా ఆస్ట్రేలియా ం0.475తో రెండో స్థానంలో ఉంది. ఇంగ్లండ్ –0.475తో థర్డ్ ప్లేస్‌లో అఫ్గాన్.. –2.140తో నాలుగో స్థానంలో ఉంది. గ్రూప్–ఏలో భారత్, న్యూజిలాండ్ ఇప్పటికే సెమీస్ బెర్తును ఖాయం చేసుకోగా, ఆతిథ్య పాకిస్థాన్, బంగ్లాదేశ్ టోర్నీ నుంచి వైదొలిగిన విషయం విదితమే.

ఆ నిధులన్నీ ఏం చేశారు?

దక్షిణాఫ్రికా, ఆసీస్ మ్యాచ్ వర్షార్పణమైన నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిర్వహణ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ కోసం ఐసీసీ నుంచి భారీగా నిధుల్ని దక్కించుకున్న పీసీబీ.. వాటిని సరైన రీతిలో వినియోగించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ తన 'ఎక్స్' ఖాతాలోనూ దీనిపై గళమెత్తాడు. రావల్పిండి స్టేడియాన్ని పూర్తిగా కప్పిఉంచే కవర్లు కూడా లేకపోవడం సిగ్గుచేటని, ఐసీసీ నిధుల్ని ఆతిథ్య దేశం తెలివిగా వినియోగించుకోలేదని అతడు ట్వీట్ చేశాడు.

# సెమీస్‌కు న్యూజిలాండ్
## బంగ్లాదేశ్‌పై కివీస్ గెలుపు




తొలిఅడుగు, : ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆతిథ్య పాకిస్తాన్ జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించింది. సోమవారం జరిగిన గ్రూప్–ఎ లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు ఆరు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. దీంతో వరుసగా రెండేసి విజయాలతో ఈ గ్రూప్ నుంచి భారత్, న్యూజిలాండ్ జట్లు సెమీస్‌కు చేరగా.. మరో లీగ్ మ్యాచ్ మిగిలి ఉండగానే పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లు నిష్క్రమించాయి. ఇక బంగ్లాదేశ్‌తో సోమవారం జరిగిన గ్రూప్–ఎ రెండో లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ బౌలర్లు అదరగొట్టారు. బ్రాస్‌వెల్(4/36), రూర్కె(2)48)కి తోడు హెన్రీ, జెమిసన్ ఒక్కో వికెట్‌తో చెలరేగారు. దీంతో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 236 పరుగులకే పరిమితమైంది. బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హూస్సేన్ శాంటో(77) టాప్ స్కోరర్‌గా నిలవగా.. జాకర్ అలీ(45), రిషద్ హొస్సేన్(26) రాణించారు. మరో ఓపెనర్ తంజిద్ హొసైన్(24) కూడా ఫర్వాలేదనిపించారు. మెహిదీ హసన్(13), తౌహిద్(7), వికెట్ కీపర్ ముష్ఫికర్(2), మహ్మదుల్లా(4) నిరాశపరిచారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు తస్కిన్(10), ముస్తాఫిజుర్(3) రాణించలేకపోయారు. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ టాపార్డర్ బ్యాటర్లు నిరాశపరిచారు. ఓపెనర్లు యంగ్(0) డకౌట్ కాగా.. కాన్వే(30), విలియమ్సన్(5) రాణించలేకపోయారు. దీంతో న్యూజిలాండ్ జట్టు 72పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో భారత సంతతికి చెందిన కివీస్ మిడిలార్డర్ బ్యాటర్ రచిన్ రవీంద్ర(112) సెంచరీతో మెరిసాడు. 105బంతుల్లో 12ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 112పరుగులు చేసి రిషాద్ హొసైన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత పాకిస్తాన్‌పై సెంచరీతో రాణించిన లాథమ్ మరోసారి అర్ధసెంచరీతో మెరిసాడు. గ్లెన్ ఫిలిప్స్‌తో కలిసి మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించాడు. దీంతో న్యూజిలాండ్ జట్టు 46.1ఓవర్లలో 5వికెట్లు నష్టపోయి 240పరుగులు చేసి విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బ్రాస్‌వెల్‌కు దక్కింది.

# ఢిల్లీ టాప్ షో గుజరాత్‌పై ఘన విజయం




తొలిఅడుగు, బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. లీగ్‌లో పడుతూ లేస్తూ సాగుతున్న నిరుటి రన్నరప్ ఢిల్లీ..మంగళవారం నాటి మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి టాప్‌లోకి దూసుకెళ్లింది. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 127/9 స్కోరుకే పరిమితమైంది. భారతి(40 నాటౌట్)మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలింగ్ ధాటికి గుజరాత్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. హర్లిన్ డియోల్(5), లిచ్‌ఫీల్డ్(0), కెప్టెన్ గార్డ్‌నర్(3), కాశ్వి గౌతమ్(0), బేత్‌మూనీ(10) సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. మారిజానె కాప్(2/17), శిఖాపాండే(2/18), సదర్లాండ్(2/20) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ..15.1 ఓవర్లలో 131/4 స్కోరు చేసింది. జెస్ జొనాసెన్(32 బంతుల్లో 61 నాటౌట్, 9ఫోర్లు, 2 సిక్సలు) అజేయ అర్ధసెంచరీతో జట్టును గెలిపించింది. షెఫాలీవర్మ(44) ఆకట్టుకుంది. కాశ్వి గౌతమ్(2/26) రెండు వికెట్లు తీసింది.

# టీమిండియాలో ఆ బ్యాటింగ్ పొజిషనే కీలకం..



తొలిఅడుగు, : క్రికెటర్లు తమ తోటి క్రికెటర్ల సామర్థ్యాలపై ఎక్కువగా కామెంట్స్ చేస్తుంటారు. అలాగే మ్యాచ్ గెలుపు, ఓటముల తమదైన విశ్లేషణలు వినిపిస్తారు. మ్యాచ్ గెలవాలంటే అలా చేయాలి ఇలా చేయాలని సలహాలు ఇస్తుంటారు. తాజాగా మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ ఇలాంటి ఓ అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఆయన ప్రకారం, భారత క్రికెట్ జట్టులో క్రికెటర్ శుభ్‌మన్ గిల్ చాలా ముఖ్యమైన పాత్ర పోషించబోతున్నాడు. ముఖ్యంగా ఆస్ట్రేలియాతో జరగబోయే క్రికెట్ మ్యాచ్‌లలో గిల్ మంచి ప్రదర్శన చేస్తే భారత జట్టు గెలవడానికి మంచి అవకాశం ఉంది అని ఆయన అన్నారు. క్రికెట్‌లో 3వ బ్యాట్స్‌మన్ అనేది చాలా కీలకమైన పాత్ర. ముఖ్యంగా ఆస్ట్రేలియా లాంటి ప్రదేశంలో జరిగే మ్యాచ్‌లలో. గతంలో రాహుల్ ద్రవిడ్, చేతేశ్వర్ పుజారా లాంటి క్రికెటర్లు 3వ బ్యాట్స్‌మన్‌గా ఆడి భారత జట్టును గెలిపించారు. అదే విధంగా శుభ్‌మన్ గిల్ కూడా అలాంటి ప్రదర్శన చేయగలడని పార్థివ్ పటేల్ నమ్ముతున్నారు. పార్థివ్ పటేల్ ఆస్ట్రేలియాలో భారత క్రికెట్ జట్టు బాగా ఆడాలంటే, మూడవ బ్యాట్స్‌మన్ చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాడని చెప్పారు. అంటే, భారత జట్టులో మూడవ బ్యాట్స్‌మన్ ఎలా ఆడుతున్నాడో దానిపైనే గెలుపు బాగా ఆధారపడి ఉంటుంది. ఆయన గతంలో ఆస్ట్రేలియా వెళ్లి ఆడినప్పుడు మంచి ప్రదర్శన చేశాడు. అయితే ఆ సమయంలో అతను ఓపెనర్ గా మాత్రమే ఆడాడు కానీ థర్డ్ లేదా ఫోర్త్ బ్యాటర్ గా ఈ ప్లేయర్ ఆడితే బెటర్ అని పార్థివ్ చెబుతున్నాడు. గతంలో ఆస్ట్రేలియాలో జరిగిన గబ్బా టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు గెలిచింది. ఆ మ్యాచ్‌లో శుభ్‌మాన్ గిల్ 91 పరుగులు చేశాడు. అంటే ఆయన ఆ ఒత్తిడి భరితమైన పరిస్థితుల్లో కూడా బాగా ఆడగలడని రుజువు అయింది. శుభ్‌మన్ గిల్ గతంలో ఆస్ట్రేలియా వెళ్లి ఆడినప్పుడు ఆరు ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేశాడు. అంటే ఆయన ఆస్ట్రేలియా పిచ్‌లకు అలవాటు పడిపోయాడు. శుభ్‌మన్ గిల్ ఇప్పుడు రెండవసారి ఆస్ట్రేలియా వెళ్లి ఆడుతున్నాడు. ఆస్ట్రేలియా పిచ్‌లు, వాతావరణం గురించి పూర్తి అవగాహన పెంచుకున్నాడు. అందుకే ఇప్పుడు ఆయన నుంచి మంచి పర్ఫామెన్స్ ఆశిస్తున్నారు. అలాగే ఈసారి గిల్ మూడవ బ్యాట్స్‌మన్‌గా ఆడుతున్నాడు.

# నెదర్లాండ్స్‌కు షాకిచ్చిన భారత హాకీ జట్టు



తొలిఅడుగు, : భువనేశ్వర్: వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న భారత మహిళల హాకీ జట్టు.. నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంచలన విజయం సాధించింది. ఒలింపిక్ చాంపియన్స్, ప్రపంచ నంబర్‌వన్ జట్టు అయిన నెదర్లాండ్స్‌ను షూటౌట్‌లో ఓడించి సోమవారం ఇదే జట్టుపై కలిగిన పరాభవానికి బదులు తీర్చుకుంది. మ్యాచ్‌లో నిర్దేశిత సమయానికి స్కోర్లు 2–2తో సమమవగా పోరు షూటౌట్‌కు దారితీసింది. షూటౌట్‌లో భారత్ 2–1తో డచ్ జట్టుకు షాకిచ్చింది. డచ్ తరఫున సాండర్స్ (17ని.), ఫే వాన్ డర్ (28ని.) రెండు గోల్స్ చేసి తొలి అర్ధభాగం ముగిసే సరికి 2–0 ఆధిక్యంలో నిలిచారు. కానీ థర్డ్ క్వార్టర్‌లో దీపికా (35ని), బాలాజీ కౌర్ (43ని.) తలా ఓ గోల్ చేయడంతో స్కోర్లు సమమయ్యాయి. షూటౌట్‌లో దీపికా, ముంతాజ్ బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపించగా.. నెదర్లాండ్స్ నుంచి మరిన్ వీన్ మాత్రమే గోల్ చేయడంలో సఫలమైంది. పురుషుల విభాగంలో భారత్.. 2–1తో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది.